



కరగతో అర్చకుడు జ్ఞానేంద్ర

గోవిందా..!





ధర్మరాయస్వామి ఆలయం వద్ద రథోత్సవంలో భక్తుల సందడి

- వేలాదిమంది భక్తుల మధ్య కరగ ఉత్సవం
- అర్ధరాత్రి నుంచి తెల్లవారుదాకా ఊరేగింపు
- హాజరైన సీఎం, డీసీఎం

బెంగళూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మకమైన బెంగళూరు కరగ ఉత్సవం లక్షలాదిమంది భక్తుల గోవింద నామస్మరణల మధ్య జరిగింది. సాధారణంగా పౌర్ణమి రోజు అర్ధరాత్రి వేళ ద్రౌపదీదేవి కరగ శక్తి ఉత్సవం ప్రారంభం కావాల్సి ఉండేది. కానీ వర్షంతోపాటు పలు సమస్యలతో ఆలస్యంగా ప్రారంభమైంది. అర్చకుడు జ్ఞానేంద్ర ధార్మిక కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు ముగించాక మల్లెపూలతో ప్రత్యేకంగా అలంకరించిన కరగను మోసుకుని ఓ చేత్తో పిడిచాకు, మరో చేత్తో కర్రను ధర్మరాయస్వామి ఆలయం నుంచి బయటకు వచ్చారు. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లు పాల్గొన్నారు. నగరత్ పేట నుంచి ప్రారంభమైన కరగ ఉత్సవం వివిధ ప్రాంతాలలో ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు సిటీ మార్కెట్ ప్రాంతానికి చేరుకుంది. అక్కడనుంచి మస్తాన్ దర్గాకు, తర్వాత అణ్ణమ్మ గుడి మీదుగా బీవీకే అయ్యంగార్ రోడ్డు, అవెన్యూరోడ్డుల మీదుగా ఆలయానికి చేరింది. కరగ వెంట వేలాదిమంది తిగళ సముదాయానికి చెందినవారు కత్తులు చేతబట్టి నడిచారు. రాత్రంతా సాగిన కరగ ఉత్సవాన్ని లక్షలాదిమంది భక్తులు దర్శించుకున్నారు. కరగపై మల్లెపూలతోపాటు పలు వస్తువులు చల్లి మొక్కులు తీర్చుకున్నారు. గడిచిన కొన్నేళ్లతో పోలిస్తే ఈ ఏడాది కరగ భారీగా విజయవంతమైనట్టు ఆలయ కమిటీతోపాటు భక్తులు తెలిపారు. ధర్మరాయ స్వామి ఆలయాన్ని రాత్రంతా భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో కర్పూరం వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కరగ సాగిన ప్రాంతంలో పానకం, మజ్జిగ పంపిణీ చేశారు.



పూజల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి సిద్ద రామయ్య



భారీగా హాజరైన భక్తులు



ఉత్సవాలకు వస్తున్న ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్

కరగకు నిధుల విడుదలలో జాప్యం

- ప్రభుత్వ తీరుపై తిగళల ఆగ్రహం

బెంగళూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): చారిత్రక కరగ ఉత్సవానికి ఏటా ప్రభుత్వం గ్రాంట్లు విడుదల చేసేది. దశాబ్దాలకాలంగా ఈ విధానం కొనసాగుతూనే ఉంది. ఈ ఏడాది బీబీఎంపీ ద్వారా 1.50కోట్ల రూపాయలు కేటాయించారు. జిల్లాధికారి ఖాతాకు రూ.40లక్షలు విడుదల చేశారు. ఉత్సవం ముగిసేనాటికి కూడా ధర్మరాయస్వామి ఆలయానికి అనుబంధమైన కరగ ఉత్సవ కమిటీలకు నిధులు చేరలేదు. అర్చకుడు, కరగధారి జ్ఞానేంద్ర సొంత డబ్బులతో ఉత్సవాలు జరిపారు. పూలు కొనుగోలు చేసేందుకు ఆలయ వ్యవస్థాపక కమిటీ ద్వారా సమకూర్చామని అధ్యక్షుడు సతీశ్ విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ఉత్సవం పట్ల ఆసక్తి లేదంటే దేవదాయశాఖ నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. కరగ పూజారి రూ.20లక్షలు, బాలకృష్ణ అనే భక్తుడు రూ.20లక్షలు, తన సొంత డబ్బు రూ.20లక్షలతో కలిపి రూ.60 లక్షలు ఖర్చు చేశామన్నారు. ప్రభుత్వం ఎందుకో కరగ ఉత్సవం పట్ల ఉదాసీనం చేసిందన్నారు. ఆలయానికి సంబంధించిన ఆస్తులు, దుకాణాల అద్దెలు మాత్రం నెలవారీ వసూలు చేస్తారన్నారు. ధర్మరాయస్వామి ఆలయానికి చెందిన భూమిలోనే బీబీఎంపీ కేంద్ర కార్యాలయం ఉందన్నారు. ప్రభుత్వం గ్రాంట్ల విడుదలలో ఇలా నిర్లక్ష్యం చేస్తుందని ఊహించలేదన్నారు. శనివారం రాత్రి కరగ ఉత్సవం ప్రారంభానికి ముందు వివాదం తీవ్రమవుతుందనే ప్రచారం సాగింది. ముఖ్యమంత్రి సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లు ఉత్సవాలను ప్రారంభించేందుకు వచ్చే సమయంలో వివాదం అవుతుందని ముందస్తుగానే దేవదాయశాఖ మంత్రి రామలింగారెడ్డి వెళ్లారు. ఇదే విషయమై మంత్రి మీడియాతో మాట్లాడుతూ జిల్లాధికారి ఖాతాకు రూ.40లక్షలు విడుదల చేశామని ప్రభుత్వం జాప్యం చేయలేదన్నారు.

అయితే జిల్లాధికారి జగదీశ్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ కరగ ఉత్సవ నిర్వహణతోపాటు ఇతరత్రా పర్యవేక్షణకు ప్రభుత్వం ఓ కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. బీబీఎంపీ నుంచి రూ.40లక్షలు విడుదల చేశామని, అవసరమైన సేవలకు కాంట్రాక్టర్ ద్వారా సమకూరుస్తామన్నారు. మూడు రోజులు వరుసగా బ్యాంకులు సెలవులు ఉండడంతో జాప్యం జరిగిందన్నారు. మంగళవారం నిధులు విడుదల చేస్తామన్నారు. పూలు, విద్యుద్దీపాలంకరణలకు కాంట్రాక్టు ఇచ్చామన్నారు. దీంతో వ్యక్తిగతంగా డబ్బులు ఖర్చు చేసే అవసరం లేదన్నారు. నిధుల విడుదలలో ప్రభుత్వ నిర్లక్ష్యం లేదన్నారు.





మామిడి పండ్ల వెబ్‌సైట్

డెలివరీకి సిద్ధంగా ఉన్న మామిడి పండ్ల బాక్సులు

తపాలా శాఖ ద్వారా ఇంటికే మామిడిపండ్లు

- ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే సదుపాయం
- నాణ్యమైన రకం అందిస్తున్న ప్రభుత్వం

బెంగళూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మామిడిపండ్ల సీజన్ వచ్చేసింది. మార్కెట్‌లోకి మామిడిపండ్లు భారీగా వచ్చాయి. బెంగళూరుతోపాటు రాష్ట్రమంతటా వారం రోజుల్లోగా మార్కెట్‌లోకి మామిడి అమ్మకాలు సాగుతున్నాయి. మామిడిపండ్లు కావాలనుకునేవారు నేరుగా మార్కెట్‌కు వెళ్లి కొనుగోలు చేయడం, ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేయడం వంటివి సాధారణంగా జరుగుతున్నాయి. అయితే పోస్టల్‌శాఖ కూడా మామిడిపండ్లను సరఫరా చేసేందుకు సిద్ధమయ్యింది. ఆన్‌లైన్‌లో కోరుకున్న మామిడిపండ్లను బుక్‌చేస్తే పోస్టల్ ద్వారా ఇంటికి చేరనున్నాయి. ఏటా రాష్ట్ర మామిడి అభివృద్ధి, మార్కెటింగ్‌శాఖ రైతుల వెబ్‌సైట్‌ద్వారా బుక్ చేసుకుంటే మామిడిపండ్లను వినియోగదారుల ఇంటికి చేరుస్తోంది. అదే తరహాలోనే ఈ ఏడాది కూడా ప్రక్రియ ప్రారంభించింది. కోరుకున్న వెరైటీ మామిడిపండ్లను ఆర్డర్ చేసుకోవచ్చు. అటువంటి మామిడిపండ్లను రైతుల ద్వారా సిద్ధం చేస్తారు. ఒక బాక్సుకు 3.50 కిలోలు ఉంటాయి. పండ్ల ధరతోపాటు పార్సిల్, పోస్టల్ చార్జీలు కలిపి రూ.82 అదనంగా వసూలు చేస్తారు. ఒక్కో మామిడి వెరైటీ ఒకోరకం రేటు ఉంటుంది.

బెంగళూరు నగర పరిధికి రామనగర, చిక్కబళ్లాపుర, కోలారు జిల్లాల రైతులనుంచి వినియోగదారులకు మామిడి పండ్లను అందిస్తారు. 2019 నుంచి బెంగళూరు జనరల్ పోస్టాఫీస్ (జీపీఓ) ద్వారా మామిడిపండ్ల డెలివరీ సాగుతోంది. ఇప్పటివరకు లక్ష బాక్సులకుపైగా అందజేసినట్లు పోస్టల్ అధికారులు పేర్కొంటున్నారు. పోస్టల్ సేవ ద్వారా వినియోగదారులు రైతునుంచి నేరుగా మామిడి కొనుగోలు చేయవచ్చు. ఇందులో మధ్యవర్తులు ఉండరు. కెమికల్ రహిత, నాణ్యమైన పండ్లు పొందేందుకు అవకాశం ఉంది. ఈ ఏడాది రైతులనుంచి నేరుగా మామిడిపండ్లు కొనుగోలు చేసేందుకు డిమాండ్ ఎక్కువగా ఉన్నట్లు రైతులు అభిప్రాయపడుతున్నారు.

మామిడిపండ్లను బుక్ చేసుకోవడం ఎలా..?

కర్ణాటక సిరి మ్యాంగోస్ డాట్ కర్ణాటక డాట్ గవర్నమెంట్ డాట్ ఇన్ వెబ్‌ను సందర్శించాలి.
రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు విక్రయిస్తున్న పండ్లు, ధర సమాచారం తెలుసుకోవాలి.
వినియోగదారులకు అవసరమైన పండ్లను ఎంపిక చేసుకోవాలి.
ఆన్‌లైన్‌లోనే పోస్టల్ చార్జీలతో కలిపి చెల్లించాలి.
బుక్ చేసుకున్న తర్వాత మెయిల్, మొబైల్‌కు సమాచారం వస్తుంది.
పోస్టల్‌శాఖ రైతులకు బుకింగ్ సమాచారం పంపుతుంది.
బుక్ చేసుకున్న 2-3రోజుల్లో పోస్టల్‌శాఖ ద్వారా ఇంటి ముంగిటకు మామిడిపండ్లు చేరనున్నాయి.
పోస్టల్‌శాఖ ద్వారా కేవలం ఉత్తరాలు, మనీ ఆర్డర్‌లు, రిజిస్టర్ పోస్ట్ వంటి సేవలు మాత్రమే ఉండేవి. బెంగళూరులో మామిడి పండ్లను అభిమానించేవారికి సేవలు అందిస్తూ వందలాది మంది రైతులకు చేదోడుగా నిలుస్తోంది. అటు వినియోగదారులకూ నాణ్యమైన ఫలాలు దొరుకుతాయి.

ఓబీసీల రిజర్వేషన్ 52 శాతానికి పెంపు..?

- కులగణన నివేదిక సిఫారసు
- ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి

బెంగళూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వెనుకబడిన కులాల జనాభా 69.60శాతానికి చేరింది. జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ శాతాన్ని 52కు పెంచాలనే కులగణన నివేదిక సిఫారసు చేస్తోంది. ప్రస్తుతం వెనుకబడిన వర్గాలకు రాష్ట్రంలో 32శాతం రిజర్వేషన్ అమలులో ఉంది. గత ఏడాది ఫిబ్రవరిలో బీసీ కమిషన్ చైర్మన్ జయప్రకాశ్‌హెగ్డే నేతృత్వంలో ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో పొందుపరిచినట్లు సమాచారం. తాజాగా శుక్రవారం కులగణన నివేదికను మంత్రివర్గం స్వీకరించింది. అదే రోజున సీల్డ్ కవర్‌ను తెరిచారు. మంత్రులందరికీ కులగణనకు సంబంధించిన నివేదికలను పంపారు. ఈనెల 17లోగా మంత్రులు సమగ్ర అధ్యయనం చేసి తీర్మానించాల్సి ఉంది. అధికారికంగా కులగణన నివేదిక బహిరంగం కాలేదు. అయినా నివేదిక సర్వే కొనసాగిన 2015లో రాష్ట్రంలో 6.35 కోట్లమంది జనాభా ఉండగా వీరిలో 5.98 కోట్లకు సంబంధించిన జర్వే జరిగింది. ఈ సమాచారానికి అనుగుణంగా కులాల జనాభా ఎంతమేర ఉందనే గణాంకాల ఆధారంగా రిజర్వేషన్ పెంపునకు బీసీ కమిషన్ సిఫారసు చేసింది.

ప్రస్తుతం చట్టాల ప్రకారం 50శాతానికి మించి రిజర్వేషన్లు అమలు చేయడానికి వీల్లేదు. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా ఎస్సీ రిజర్వేషన్‌ను 18 నుంచి 24శాతానికి పెంచారు. బీసీలకు ప్రస్తుతం 32శాతం అమలులో ఉంది. దీన్నిబట్టి రాష్ట్రంలో 56శాతం అమలులో ఉన్నట్లు అయ్యింది. కేంద్రప్రభుత్వం అమలులోకి తెచ్చిన 10శాతం ఈడబ్ల్యుఎస్ (ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు) కలిపితే 66శాతం రిజర్వేషన్ అమలులో ఉన్నట్టు అవుతుంది. ఇందిరా సాహ్నీ, కేంద్రప్రభుత్వ ఇతర వివాదాలలో సుదీర్ఘ విచారణల తర్వాత సుప్రీంకోర్టు ధర్మాసనం రిజర్వేషన్‌లు 50శాతానికి మించరాదని సూచించింది.

బీసీ కమిషన్ సిఫారసు చేసిన రిజర్వేషన్ల వివరాలు

కేటగిరీ	ప్రస్తుతం	సిఫారసు
1(ఏ)	4శాతం	6శాతం
1(బీ)	7శాతం	12శాతం
2(ఏ)	7శాతం	10శాతం
2(బీ)	5శాతం	8శాతం
3(ఏ)	4శాతం	7శాతం
3(బీ)	5శాతం	9శాతం
మొత్తం	32శాతం	52శాతం

తమిళనాడులో 69 శాతం..

జనాభా ఆధారంగా తమిళనాడులో 69శాతం జార్ఖండ్‌లో 77శాతం అమలులో ఉంది. రాష్ట్రంలో కులగణన నివేదికలో ముఖ్య కులాలు, వాటి ఉపకులాలతో కలిపితే వెనుకబడినవర్గాల జనాభా 69.69 శాతం అవుతుంది. జనాభా ఆధారంగా బీసీ వర్గాలకు విద్య, ఉద్యోగాలలో ఎక్కువ అవకాశాలు కల్పించాలంటే ప్రస్తుతం ఉన్న 32 శాతం రిజర్వేషన్లను 69శాతానికి పెంచాల్సి ఉంటుంది. కానీ క్రీమీలేయర్ అమలులో ఉన్నందున బీసీలకు 51శాతానికి పెంచవచ్చునని కమిషన్ సిఫారసు చేసింది. వీటికి అనుగుణంగా 51శాతం రిజర్వేషన్‌ను వర్గాలవారీగా విభజించింది.

బీసీ కమిషన్ సిఫారసుల్లో ప్రధానంగా ముస్లిం సమాజానికి చెందిన జనాభా 75.27 లక్షలమంది ఉన్నారు. ఎస్సీల తర్వాత ఎక్కువ జనాభా కల్గినవారు ముస్లింలు కావడంతో రిజర్వేషన్ 8శాతానికి పెంచాలని అభిప్రాయపడింది. బలమైన సామాజికవరాల్లో ఒకటైన ఒక్కలిగలు 65.50లక్షల మంది కాగా ఉపకులాలతో కలిపితే 72లక్షలు కానున్నారు. కేటగిరీ 3ఏ జాబితాలో రిజర్వేషన్ ప్రమాణాన్ని ప్రస్తుతం ఉన్న 4నుంచి 7కు పెంచవచ్చు. కేటగిరీ 3బీ జాబితాలో లింగాయతుల జనాభా 66 లక్షలు కాగా ఉపకులాలతో కలిపితే 81లక్షలకు చేరనుంది. జనాభాకు అనుగుణంగా ప్రస్తుతం అమలు చేస్తున్న 5శాతం నుంచి 8శాతానికి పెంచవచ్చు. వ్యక్తి, సామాజిక పరిస్థితులకు అనుగుణంగా కేటగిరీ 1 పరిధిలోని కులాల రిజర్వేషన్‌ను 4నుంచి 6శతానికి పెంచవచ్చు. కేటగిరీ 2ఏ కులాలకు వర్గీకరణ చేసి ప్రస్తుతం ఉన్న 15ను 22శాతానికి పెంచవచ్చు.

కులగణన 95 శాతం సమంజసం : సీఎం సిద్దరామయ్య



కులగణన 95శాతం సమంజసంగా ఉందని, తాను ఒక బీసీ వర్గానికి చెందినవాడిగా అభిప్రాయపడుతున్నానని ముఖ్యమంత్రి సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. మంత్రివర్గంలో నివేదికను స్వీకరించామని, ఆ తర్వాత సభలో చర్చిస్తామన్నారు. ఏ సర్వే కూడా వంద శాతం సరిగా ఉండదని, కులగణన గ్రామీణ ప్రాంతాల్లో 98శాతం, నగర ప్రాంతాలలో 96శాతం జరిగిందన్నారు. 1.6లక్షలమంది భాగస్వామ్యులై సాంకేతికంగా సర్వే చేశారన్నారు. కులగణన నివేదిక ఎన్నికల ప్రణాళికలో ఉందన్నారు. ఇదే విషయమై మంత్రి ఎంబీ పాటిల్ స్పందిస్తూ కులగణన సర్వేపై ఇంకా చర్చలు జరగాల్సి ఉందన్నారు. డీసీఎం డీకే శివకుమార్ అభిప్రాయం మేరకు కులగణన నివేదిక విషయంలో ఆత్రుత ఉండదని, సమగ్రంగా చర్చించాకే నిర్ణయం తీసుకుంటామన్నారు. జేడీఎస్ పార్టీ యువనేత నిఖిల్ మాట్లాడుతూ తనతో పాటు తన తాత మాజీ ప్రధాని దేవేగౌడ ఇంటికి వచ్చి ఎవరూ సర్వే చేయలేదని, రాష్ట్రమంతటా సర్వే జరిగిందని ఎలా చెబుతారన్నారు. ఇదే విషయమై బీజేపీ తీవ్రంగా స్పందించింది. రాష్ట్రంలో ముస్లింలను అత్యధిక జనాభా అనిచూపేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నిందన్నారు. ఓటుబ్యాంకుకోసం ఇదో కొత్త ఎత్తుగడ అని మండిపడ్డారు.

ప్రస్తుతం ఎస్సీలకు 17.5శాతం, ఎస్టీలకు 6.95శాతం, బీసీలకు 32శాతం, ఈడబ్ల్యుఎస్ 10శాతంతో కలిపి 66శాతం అవుతుంది. సిఫారసు ప్రకారం ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యుఎస్‌లకు యథాస్థితిగా రిజర్వేషన్ కొనసాగించాలి. మొత్తం రిజర్వేషన్‌లు 85.1కు చేరగా 14.9శాతం జనరల్ కోటాకు మిగలనుంది.

నేటి నుంచి లారీల సమ్మె



బెంగళూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): డీజిల్ ధరలు, టోల్‌చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ సోమవారం అర్ధరాత్రి నుంచి నిరవధికంగా లారీల సమ్మె చేపట్టనున్నట్లు రాష్ట్ర లారీ యజమానుల సంఘం ప్రకటించింది. గడిచిన ఆరు నెలల్లో పలుమార్లు డీజిల్ ధరలు పెరిగాయని, ఇటీవల రాత్రికి రాత్రి లీటరుకు రూ.2 పెంచారని ఆవేదన వ్యక్తం చేశారు. శాస్త్రీయత లేని విధంగా టోల్‌చార్జీలు పెంచుతున్నారని లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు జీఆర్ షణ్ముగప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. లారీల సమ్మెకు పలు పెట్రోల్ బంకులు, ఎయిర్‌పోర్ట్ ట్యాక్సీ సంఘాలు మద్దతు ఇచ్చాయన్నారు. మంగళవారం నుంచి కంకర, ఇసుక రవాణా చేసే లారీలు, గూడ్స్ వాహనాల యజమానులు సమ్మెలో పాల్గొంటారన్నారు. రాష్ట్రంలో 6లక్షలకుపైగా లారీలు ఉన్నాయని అందరూ కలసి సమష్టిగా సమ్మె చేపడుతున్నామన్నారు. దక్షిణాదిన అన్ని రాష్ట్రాలకంటే కర్ణాటకలోనే డీజిల్ ధర తక్కువని, లారీల సమ్మెకు మద్దతు ఇచ్చేది లేదని ఫెడరేషన్ ఆఫ్ కర్ణాటక లారీ ఓనర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చెన్నారెడ్డి మెలిక పెట్టారు. అయితే ఎక్కువమంది సమ్మెలో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు.





రథోత్సవానికి హాజరైన భక్తజన సందోహం, రత్నాలు పొదిగిన కిరీటంతో విరూపాక్షుడు (ఇన్‌సెట్లో..)

వైభవంగా జోడు రథోత్సవం

బళ్లారి సిటీ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): హంపి విరూపాక్షేశ్వరుడు, పంపాంబికాదేవీల జోడు రథోత్సవాలు వైభవంగా జరిగాయి. మహా రథోత్సవం, విద్యారణ్యభారతి స్వామీజీతో చంద్రమౌళేశ్వరుని చిన్న రథోత్సవం శనివారం సాయంత్రం వేలాదిమంది భక్తుల సమక్షంలో నిర్వహించారు. విరూపాక్ష, పంపాంబిక ఉత్సవ విగ్రహాలు రథాలజత ఒకదాని వెనుక ఒకటి వెళ్తుండగా భక్తులు హరనామస్మరణతో పరిసరాలు మార్మోగాయి. రథాలపై అరటి పండ్లు, ఆగరుబత్తులు విసిరి మొక్కులు చెల్లించుకున్నారు. విరూపాక్షుడు ప్రత్యేక సందర్భాలలో మాత్రమే ధరించే బంగారు ముసుగు, కిరీటాన్ని చూసి భక్తులు తిలకించిపోయారు. విజయనగర రాజు కృష్ణదేవరాయలు తయారు చేసినట్లు చె ప్పబడుతున్న ఈ కిరీటం 6కిలోల బరువు ఉంటుంది. మహాశివరాత్రి, రథోత్సవాలతోసహా ప్రత్యేక సందర్భల్లో మాత్రమే దీనితో అలంకరిస్తారు.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1584.99	1,578.98
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	411	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	1,309	112
నీటి నిల్వ (టీఎంసీలు)	7.32	3.99

నేలచూపులు..!

- జిల్లాలో పడిపోయిన రియల్ ఎస్టేట్
- భూములపై రూ.కోట్లలో పెట్టుబడులు
- అమ్ముడుపోక వ్యాపారుల్లో అయోమయం
- 'బుడా' నిబంధనలతో మరిన్ని కష్టాలు



బళ్లారి, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): ఘనుల గడ్డగా పేరు గాంచిన బళ్లారి జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిగా స్థంబించింది. ఒకప్పుడు పరుగులు పెట్టు కుంటూ వచ్చిన వ్యాపారులు ఇప్పుడు ఇక్కడ ఎందుకు పెట్టబడులు పెట్టామా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ. కొట్లల్లో పెట్టుబడులు పెట్టిన స్థలాలు అమ్ముడుపోక నేల చూపులు చూస్తున్నారు. ఆంధ్ర-కర్నాటక రాష్ట్రాల సరిహద్దు జిల్లాగా పేరు గాంచిన బళ్లారి గతంలో రియల్ వ్యాపారంగా ఎంతో ఖ్యాతి ఉండేది. సరిహద్దు జిల్లాలైన కర్నూలు, అనంతపురం లోని కొన్ని ప్రాంతాల ప్రజలు ఇక్కడ స్థలాల కొనుగోలుపై ఆసక్తి చూపేవారు. అయితే బళ్లారి జిల్లా నుంచి విజయనగరం విడిపోవడం, మైనింగ్ కార్యకలాపాలు నిలిచిపోవడం కారణంగా రియల్ వ్యాపారం భారీగా పడిపోయింది. ఒకప్పుడు చదరం రూ.2 వేలు పలికిన సందర్భాలూ ఉన్నాయి. గాంధీనగర్, కప్పగల్లు రోడ్డు, తాల్లూరురోడ్డు, మోకారోడ్డు లాంటి ప్రాంతాల్లో భారీగా డిమాండ్ ఉండేది. హొస్పేట్‌రోడ్డు, బెంగళూరు రోడ్డు లాంటి ఏరియాల్లో కాస్త తక్కువ ధరలోనే దొరికేవి. అయితే ఇప్పుడు సీన్ మారిపోయింది. స్థలాలకూ డిమాండ్ లేకుండా పోయింది

నాడు జోరుగా మైనింగ్..

మైనింగ్ కార్యకలాపాలు ఉచ్చదశలో ఉన్నప్పుడు బళ్లారిలో భూముల ధరలు బెంగళూరు లాంటి నగరాలతో సరితూగేవి. దీన్ని దృష్టిలో ఉంచుకుని చాలా మంది రియల్ వ్యాపారంలోకి అడుగుపెట్టారు. నగరం చుట్టూ ఉండే పొలాలను రూ. కోట్లు పెట్టి కొని వెంచర్లు వేశారు. వెంచర్లలో రోడ్డు, విద్యుత్తు సౌకార్యాలు, బుడా అనుమతులు తదితర వాటికి రూ.లక్షలు వెచ్చించారు. కానీ గత ఏడాది నుండి రియల్ వ్యాపారం మందగించింది. వెంచర్‌లో వంద ప్లాట్లు వేస్తే ఏదో రెండు మూడు అమ్ముడు పోవడం, మిగిలిన ప్లాట్లు కొనేందుకు ఎవరూ రాకపోవడంతో వ్యాపారులు లబోదిబోమంటున్నారు. ప్లాట్ల రేట్లు తగ్గించినా కొనడానికి ఎవ్వరూ ముందుకు రావడం లేదు. దాదాపు బళ్లారి, విజయనగర జిల్లాల పరిదిలో వందల వెంచర్లు వెలిశాయి. వీటిలో ఎక్కువ శాతం అమ్ముడు పోక అలాగే ఉన్నాయి. ఇంత ముందు వ్యవసాయ పొలాలను చదును చేసి ప్లాట్లు వేశారు. అనుకున్నట్లు అమ్ముడు పోక పోవడంతో కొందరు మళ్లీ వ్యవసాయ పొలాలుగా మార్చుకుంటున్నారు. బళ్లారి నగరం చుట్టూ దాదాపు 7 నుంచి 10 కిలో మీటర్ల పరిధిలో వెంచర్లు వెలిసాయి. కొవిడ్ కాలం నుంచి స్థలాలకు డిమాండ్ పడిపోయింది. రిజిస్ట్రేషన్లు లేకపోవడంతో ప్రభుత్వానికి ఆదాయం కూడా భారీగా పడిపోయింది.

బుడా తీర్మానాలు రద్దు..

బళ్లారి అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ(బుడా)లో గతంలో తీర్మానించిన అంశాలను రద్దు చేస్తూ రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేయడంతో రియల్ వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. కొందరు రియల్ వ్యాపారులు బుడా అనుమతులుతో వెంచర్లు వేసి ప్లాంట్లు అమ్ముకునేందుకు సిద్దంగా ఉన్నారు. బుడా అధ్యక్షుడు జేఎస్ ఆంజనేయులు జరిపిన రెండు సమావేశాల్లో నిబంధనలకు విరుద్దంగా వ్యవహరించారని రెండు సమావేశాల్లో తీసుకున్న తీర్మాణాలను రద్దు చేయాలని ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, కంప్లి ఎమ్మెల్యే గణేష్ పట్టుబట్టడంతో వాటిని రద్దు చేసినట్లు ప్రకటించారు. దీంతో రియల్ వ్యాపారులు అనుమతుల కోసం రూ.లక్షలు చెల్లించి అనుమతులు తెచ్చుకున్నామని, ఇప్పుడు తమ పరిస్థితి ఏంటని వాపోతున్నారు. అంతే కాకుండ బుడాలో అక్రమాలకు పాల్పడుతున్న ఆరుగురు అధికారులపై లోకాయుక్త కేసు నమోదు చేసింది. ప్రస్తుతం బుడా కమీషనర్‌గా బళ్లారికి రావడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. ఇలా అనేక కారణాలు రియల్ ప్యాపారుల పై దెబ్బమీద దెబ్బ పడుతున్నాయి.

కనువిందు చేసిన బాలమేళా..



వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారులు

కంప్లి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో కుడితిని గ్రామంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలమేళా విశేషంగా ఆకట్టుకుంది. శనిజరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా మేనేజర్ జగన్నాథ్ మాట్లాడుతూ పిల్లలకు చిన్నారులకు అంగన్‌వాడీల్లో ఆరోగ్యం, ఆనందం సాధ్యమన్నారు. అనంతరం చిన్నారులు వేషభూషణలతో ఆకట్టుకున్నారు.పిల్లలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్ రామకృష్ణ, బసమ్మ, సుజాత, శంకరమ్మ, లోకేష్, పార్వతి, దేవేంద్ర నళిని మంజుళ, డాక్టర్ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దిశా సమితి సభ్యుడిగా దానప్ప



దానప్పను అభినందిస్తున్న అధికారులు, సంఘ సంస్థ నేతలు

కంప్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఏసీ దానప్పను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ దిశా సమితి సభ్యుడిగా నియమించారు. ఆదివారం కంప్లి పట్టణంలో అతిథి గృహంలో ఆయనను పలువురు అధికారులు సంఘ సంస్థ నేతలు అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ పీడబ్ల్యూడీ అధికారి రమణ మాట్లాడుతూ ఏసీ దానప్పకు ప్రభుత్వం సముచిత స్థానం కల్పించిందన్నారు. కార్యక్రమంలో చలపతి సమాజం రాష్ట్ర సంఘటన కార్యదర్శి నరసప్ప, శివకుమార్, సోమశేఖర్, దేవన్న, వీరేష్ పాల్గొన్నారు.

ఈదురుగాలులకు కూలిన విద్యుత్ స్తంభాలు, చెట్లు



పడిపోయిన విద్యుత్ స్తంభం, చెట్లు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): సండూరులోని పలు ప్రాంతాల్లో ఈదురు గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. శనివారం రాత్రి చోరనూర్ గ్రామం పరిసర ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలి, వర్షం కారణంగా విద్యుత్తు స్థంభాలు కూలోపోయాయి. చోరనూరు, బొమ్మగట్ట స్వామిహళ్ళి, తుంబరగుడి, యారదమ్మనహళ్ళి ,జి.ఎల్.హళ్ళి, వద్దినకట్టె తదితర గ్రామాల్లో అరగంటకు పైగా మంచి వర్షం కురిసింది. బొమ్మగుట్ట గ్రామంలోని హాలికుంటేశ్వర స్వామి ఆలయం సమీపంలో గాలి,వర్షం కారణంగా రెండు విద్యుత్ స్థంభాలు చెట్లు నేలకూలాయి. రోడ్డుపై వాహన సంచారానికి ఇబ్బందిగా మారింది.

పాముకాటుతో విద్యార్థిని మృతి



శ్రావణి (ఫైల్)

బళ్లారిరూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తాలుకాలోని కొత్త మోకా గ్రామంలో పాము కాటుకు విద్యార్థిని మృతి చెందింది. గ్రామానికి చెందిన లక్ష్మన్న, సెగమ్మ దంపతుల కుమార్తె శ్రావణి పదవ తరగతి చదువుతోంది. అమ్మాయి శనివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పాము రెండు మూడుచోట్ల కాటు వేసింది. శ్రావణి ఇంట్లోనే మృతి చెందినట్లు తల్లిదండ్రులు తెలిపారు. ఇంట్లోనే ఉండడంతో పామును చంపేశారు. నిద్రిస్తున్న సమయంలో పాము కాటు వేసింది. మోకా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

త్వరలో చక్కెర కర్మాగారం ప్రారంభం: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గవియప్ప

బళ్లారి సిటీ,ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): విజయనగం జిల్లా హొస్పేట సమీపంలో ప్రభుత్వం చక్కెర కర్మాగారాన్ని ఏర్పాటు చేయబోతోందని ఎమ్మెల్యే గవియప్ప అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నెల రోజుల్లో జిల్లాకు వస్తారని,ఆయనతో ఏర్పాటు చేసిన భూవివాదం వంటి అంశాలపై చర్చిస్తామన్నారు. చక్కెర కర్మాగారానికి సంబంధించిన భూవివాదాన్ని చర్చల ద్వారా పరిష్కరిస్తామన్నారు. కుల గణనకు తన పూర్తి మద్దతు ఉందని, అందరినీ విశ్వాసంలోకి తీసుకొని ముఖ్యమంత్రి కుల గణన నివేదికను విడుదల చేశారన్నారు.

ఘనంగా మహేశ్వరస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



అలంకరణలో పంపాపతి స్వామి

తోరణగల్లు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): సండూరు తాలుకా కురేకుప్పలోని పంపాపతి మహేశ్వరస్వామి రథోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయమే దేవస్థానంలో వివిధ దేవతా కార్యక్రమాలను నిర్వహించి పంపాపతిస్వామిని విశేషంగా అలంకరించారు. వీరభద్రస్వామిని, వినాయక స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. రథోత్సవంలో పలువురు భక్తులు విశేషంగా పాల్గొన్నారు.



పూజలందుకుంటున్న వీరభద్రస్వామి

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సిరుగుప్ప, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో కృషి చేస్తారని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ముఖ్య ఉపాధ్యాయులు మహేంద్ర అన్నారు. ఆదివారం సిరుగుప్ప తాలుకాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అగసనూరు గ్రామంలో 2002-2003 సంవత్సరంలో విద్యనభ్యసించిన పూర్వవిద్యార్థుల సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. శిష్యులు గురువులను సాదరంగా పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగదీషయ్యస్వామి, సుశీల, వెంకటేశ్వర్లు తదితరులకు సన్మానం చేశారు.



ఉపాధ్యాయులతో కలిసి పూర్వ విద్యార్థులు



షోరూంను ప్రారంభిస్తున్న శ్రీకాంత్, రవికాంత్

ఆర్‌కే ఎలక్ట్రానిక్స్ నూతన శాఖ ప్రారంభం

బళ్లారి సిటీ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఆధునిక కాలనానికి తగినట్లుగా ఆధునాతన పరిజ్ఞానంతో కూడిన గృహోపయోగ వస్తువుల అమ్మకాలతో దూసుకెళ్తున్న ఆర్‌కే ఎలక్ట్రానిక్స్ మరో శాఖను ప్రారంభించింది. వినియోగదారులకు నాణ్యమైన వస్తువులను అందించడానికి సిరుగుప్ప మేర్‌రోడ్డు, ఎస్‌బీఐ ఎదురుగా నాల్గవ నూతన షోరూంను ఆదివారం ప్రత్యేక పూజలను ఆచరించి ప్రారంభించారు. ఈసందర్భంగా సంస్థ నిర్వాహకులు రవికాంత్, శ్రీకాంత్‌లు మాట్లాడుతూ రెండు శతాబ్దాలుగా మార్కెట్‌లో ఆర్‌కే ఎలక్ట్రానిక్స్ అంటే నాణ్యతకు మారు పేరుగా గుర్తింపు పొందామన్నారు. ప్రస్తుతం కార్పోరేట్ కంపెనీల పోటీకి ఎదుర్కొని వ్యాపారం చేస్తున్నామంటే బళ్లారి జిల్లా ప్రజలకు, తమ పట్ల ఉన్న నమ్మకమే కారణమన్నారు. ఈరోజు సిరుగుప్పలో కూడా తమ సంస్థను ప్రారంభించే అవకాశం కలిగిందన్నారు. వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించడంతోపాటు వారి అభిరుచులకు తగినట్లుగా మార్కెట్‌లో ఉన్న బ్రాండెడ్ ఎలక్ట్రానిక్స్ వస్తువులు, గృహోపయోగ వస్తువులన్నీ ఆర్‌కే ఎలక్ట్రానిక్స్‌లో లభిస్తాయన్నారు. వినియోగదారుల ఆర్థిక పరిస్థితులకు తగినట్లుగా కొనుగోలుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. సులభవాయిదా పద్ధతిలో, సున్నా శాతం వడ్డీతో వస్తువులు కొనుగోలు చేసేందుకు బజాజ్, హెచ్‌డీఎఫ్‌సీ ఫైనాన్స్ సంస్థలు సిద్దంగా ఉన్నాయని, వినియోగదారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రుణ సౌకర్యంతో పాటు కొనుగోళ్లపై ప్రత్యేక బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ ధరలకే తమ సంస్థలో వస్తువులను అందిస్తున్నామని, నిబంధనలకు లోబడి ప్రతి కొనుగోలుపై అష్యూర్డ్ బహుమతి అందిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా పలువురు పుర ప్రముఖులు, బంధుమిత్రులు. కుటుంబసభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బస్సుల కొరతతో అవస్థలు



బస్సు వద్ద ప్రయాణికుల రద్దీ

సిరుగుప్ప, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): బస్సుల కొరతతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిరుగుప్ప పట్టణ ఆర్టీసీ బస్టాండులో సిరుగుప్ప నుంచి రాయచూరు వెళ్లాలన్నా సిరుగుప్ప నుంచి బళ్లారికి వెళ్లాలన్నా బస్సుల కొరతతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సు పేరుతో పథకం జారీ చేయడంతో బస్సులను తగ్గించడం జరిగింది. దీంతో వేళలకు సరిగా బస్సులు రాక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే అదనపు బస్సులు విడుదల చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కురుబల గౌరవం పెంచిన సిద్దరామయ్య

- బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా సీఎం పదవి నుంచి దించలేదు
- మంత్రి బైరతి సురేష్



కనకదాస విగ్రహావిష్కరణలో మంత్రి బైరతి సురేష్, ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

బళ్లారి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు కురుబలు అంటేనే చిన్నచూపు చూసేవారని, కేవలం గొర్రెల కాపర్లుగా భావించేవారని అయితే సీఎం సిద్దరామయ్య కురుబల గౌరవాన్ని పెంచారని రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి బైరతి సురేష్ అన్నారు. ఆదివారం బళ్లారి జిల్లా కురుగోడు తాలూకా కలకంబ గ్రామంలో సంగొల్ల రాయప్ప విగ్రహాన్ని మంత్రి సురేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, మాజీ మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే గణేష్, ఎమ్మెల్సీ యతీంద్ర సిద్దరామయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి బైరతి సురేష్ మాట్లాడుతూ సిద్దరామయ్య విశ్వాసానికి మారుపేరన్నారు. బీజేపీ సిద్దరామయ్యపై బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా ఆయన్ని పదవి నుంచి దింపలేరన్నారు. ముడా విషయంలో బీజేపీ ఎన్ని కుయుక్తులు వేసినా సిద్దరామయ్య కోర్టులో క్లీన్ చిట్‌గా బయటకు వచ్చారన్నారు. తొలివిడత ఐదేళ్లు, ఇప్పుడు 5 ఏళ్లు 10 ఏళ్ల పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా కొనసాగిన వారిలో సిద్దరామయ్య ఉంటారని పేర్కొన్నారు. వీరితో పాటు కాంగ్రెస్ నాయకులు, తదితరలు పాల్గొన్నారు.

కన్నడిగులకు అన్యాయం చేస్తే పోరాటం: అమృత పాటిల్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అమృతపాటిల్, నాయకులు

గంగావతి రూరల్,ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కన్నడిగులకు అన్యాయం జరిగితే ఏ పోరాటానికైనా సిద్ధంగా ఉంటానని వీర కన్నడిగ సేన రాష్ట్ర అధ్యక్షురాలు అమృత పాటిల్ అన్నారు. కొప్పళ తాలూకా పంచాయతీ హాల్లో ఆదివారం జరిగిన వీర కన్నడిగరసేన జిల్లా యూనిట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సరిహద్దు సమస్యలపై మహారాష్ట్ర, గోవా, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ,కేరళ రాష్ట్రాల్లో కన్నడిగులను, కన్నడ భాషను అగౌరవపరిచే వారిపై తమ సంస్థ పోరాడుతుందన్నారు. ఆర్టికల్ 371 యొక్క సముచిత విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్య అతిథి, సాహితీవేత్త గోనాల్ మాట్లాడుతూ ధైర్యవంతులైన కన్నడిగ సేన కన్నడిగుల హక్కుల కోసం పోరాడుతుం దన్నారు. సీనియర్ ఆర్గనైజర్ గాలెప్ప కడేమణి మాట్లాడుతూ సంస్థలు సజీవంగా ఉండాలంటే ప్రజాసేవకు సిద్ధంగా ఉండాలన్నారు. వేదికపై రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవి ఒంటి, జిల్లా యూనిట్ ఉపాధ్యక్షుడు ద్యామన్న గుడ్లమర ఉన్నారు. గౌరవాధ్యక్షులు గవి సిద్దప్ప తదితరులు పాల్గొన్నారు.

భగీరథ మహర్షి విగ్రహానికి అభిషేకం

బళ్లారిరూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని కప్పగల్ రోడ్డు భగీరథ మహర్షికి ఆదివారం అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామభక్తుడు పవనపుత్రుడు, హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భగీరథ ట్రస్టు ఆంజనేయులు రూ.లక్ష ట్రస్టుకు చెక్కు అందించినట్లు ట్రస్టు ప్రధాన కార్యదర్శి నాగేంద్ర తెలిపారు. కార్యక్రమంలో కిష్టయ్య, పోలీసు నాగరాజు, తిమ్మప్ప, శ్రీరాములు, వీరబసవయ్య, దేవేంద్ర, శివ, వెంకటరమణ, రామకృష్ణ చిన్న హనుమంతరెడ్డి, మోహన్‌రెడ్డి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భగీరథ ట్రస్టుకు రూ.లక్ష చెక్కును అందిస్తున్న భక్తుడు

హోసూరు జోన్

ఘనంగా ప్రత్యంగిరాదేవి హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

హోసూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలో ప్రసిద్ధి చెందిన రాహుకేతు అధర్వణ మహాప్రత్యంగిరాదేవి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం రాత్రి విశేషపూజలు, హోమం నిర్వహించారు. ఇక్కడ హోమంలో మిరపకాయలు వాడడం విశేషం. ప్రతి భక్తులు ఒక మిరపకాయ ముద్దను తీసుకుని దాన్ని తలచుట్టూ తిప్పుకొని చెడు దృష్టి తొలగిపోవాలని కోరుతూ హోమగుండంలో సమర్పిస్తారు. అమ్మవారికి విశేషపూజలు, మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. స్థానికులే కాకుండా సరిహద్దులోని కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యంగిరాదేవి అమ్మవారు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

రాయచూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : బైక్ పై వెళుతున్న ఇద్దరు వ్యక్తులు లారీని ఓవర్ టేక్ చేసే ప్రయత్నంలో తీవ్ర గాయాల పాలయ్యారు. ఆదివారం జిల్లాలోని సింధనూరు నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్ పై వెళుతున్న బంగాలి క్యాంప్‌కు చెందిన జ్ఞానేశ్, దేవరాజ ఇద్దరి కాళ్లు విరిగి నుజ్జునుజ్జయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సిగ్నల్ వద్ద ఆగి ఉన్న లారీని వెంబడి బైక్ పై వెళుతున్న యువకులు సిగ్నల్ ఆన్ అయిన వెంటనే ఓవర్ టేక్ చేసే ప్రయత్నంలో ప్రమాదానికి గురయ్యారు. ఈ క్రమంలో బైక్ పై ఉన్న ఇద్దరికి కాళ్లు విరిగి రోడ్డు పై పడిపోయారు. ఒక్కసారిగా రోడ్డు పై ప్రజలు పెద్ద సంఖ్యలో గుమిగూడడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ ఎస్ఐ చంద్రశేఖర్ హిరేమఠ తన సిబ్బందితో వచ్చిపరిశీలించి కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఆదేశాల మేరకు సిబ్బంది ఇద్దరు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. కాగా ప్రమాదానికి గురైన ఇద్దరు బాధితులను మస్కి ఎమ్మెల్యే బసనగౌడ తుర్విహాళ్ పరామర్శించి వారి ఆరోగ్య స్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

కేంద్రానికి వ్యతిరేకంగా అన్నాడీఎంకే ర్యాలీ



వేదికపై ఎంపీ గోపీనాథ్, ఎమ్మెల్యే ప్రకాశ్ తదితరులు

హోసూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమిళనాడు జమాతుల్ ఉలమా ఆధ్వర్యంలో ఆదివారం భారీ ర్యాలీ, నిరసన సభ జరిగింది. తొలుత వందలాదిమంది ముస్లింలు మదీనా మసీదు నుంచి ర్యాలీగా ప్రారంభమై రామనగర్‌లోని అన్నా విగ్రహం సమీపాన సమావేశం నిర్వహించారు. సమావేశానికి జమాతుల్ ఉలమా కృష్ణగిరి జిల్లా ఉపాధ్యక్షుడు హఫీజ్ నయూమ్‌జాన్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కృష్ణగిరి ఎంపీ గోపినాథ్, హ్యూమనిస్ట్ డెమోక్రటిక్ పార్టీ నాయకుడు తమిమున్ అన్సారీ, హోసూరు ఎమ్మెల్యే వై ప్రకాశ్, తళి ఎమ్మెల్యే టీ రామచంద్రన్, తమిళనాడు ముస్లిం మున్నేట్ర కజగం తదితర పార్టీల నాయకులు ముఖ్యులుగా పాల్గొన్నారు. ఇటీవల పార్లమెంటులో వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదించడాన్ని ఖండించారు. అనంతరం అన్సారీ మీడియాతో మాట్లాడుతూ ప్రతిపక్షాల డిమాండ్లను విస్మరించి 22కోట్ల మంది ముస్లింల మనోభావాలను ధిక్కరించి వక్ఫ్ సవరణ చట్టం పేరిట ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ఆరోపించారు. దీనిని ఖండిస్తూ తాము శాంతియుతంగా నిరసన చేపట్టామన్నారు.

రైతులకు చేయూతనివ్వాలి: ఎమ్మెల్యే




ఆగ్రో ఇండియా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

హోసూరు (కృష్ణగిరి), ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రైతులకు చేయూతనిచ్చే సంస్థలు ఏర్పాటు మరిన్ని రావాలని ఎమ్మెల్యే ప్రకాశ్ అభిప్రాయపడ్డారు. శూలగిరి పంచాయతీ యూనియన్ పరిధిలోని కామండొడ్డి గ్రామంలో ఫెడరేషన్ ఆఫ్ ఇండో ఇజ్రాయెల్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఎఫ్ఐఐసీసీ) సహకారంతో ఏర్పాటైన మైక్రోటెక్ అగ్రి ఫార్మ్ అండ్ మైక్రోటెక్ ప్రాఫిట్ ఆగ్రో ఇండియా సంస్థను ఎమ్మెల్యేతో కలసి కలెక్టర్ దినేశ్‌కుమార్ లాంచనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో హొసూరు కార్పొరేషన్ మేయర్ సత్య, ఇజ్రాయెల్ డిప్యూటి అంబాసిడర్ ఓర్లీ విజ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

రమణ మహర్షి (వర్ధంతి)



రమణ మహర్షి 1879 డిసెంబరు 30న తమిళనాడు రాష్ట్రం విరుద్‌నగర్ జిల్లా తిరుచ్చుళి ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు వెంకటరామన్ అయ్యం గార్. 16ఏళ్లకే మోక్షజ్ఞానం పొంది తిరువణ్ణామలైలోని అరుణాచల పర్వతాలపై స్థిర పడ్డారు. తనను తాను అతియాశ్రమిగా ప్రకటిం చుకు న్నారు. చాలా తక్కువగా ప్రసంగించేవారు. ఆమె తల్లి సమాధి సమీపంలోనే ఆశ్రమాన్ని నిర్మించారు. తన మౌనంతో సందేశం పొందలేనివారికి మాత్రమే మాట ల ద్వారా మార్గం చూపేవారు. స్వీయశోధన ఉత్తమ మని సూచించేవారు. అద్వైతం, ఉపనిషత్తుల సారాన్ని బోధించారు. 1950 ఏప్రిల్ 14న పరమపదించారు.

బీఆర్ అంబేడ్కర్ (జయంతి)



'బాబాసాహెబ్'గా పేరొందిన భారత రాజ్యాంగ నిర్మాత, భీమ్ రావ్ రామ్‌జీ అంబేడ్కర్ 1891 ఏప్రిల్ 14న అప్పటి సెంట్రల్ ప్రావిన్సెస్‌లో సైనిక స్థావరమైన మౌ అనే ప్రాంతంలో (ప్రస్తుతం మధ్యప్రదేశ్) జన్మించారు. ఆర్థికవేత్త, రాజకీయనేత, సంఘ సంస్కర్త. అస్పృశ్యతపై సుదీర్ఘ పోరాటం చేశారు. దీనదళితుల ఉద్ధరణకు పాటుపడ్డారు. మొట్ట మొదటి కేంద్ర న్యాయశాఖ మంత్రిగా వ్యవహరిం చారు. తన రచనలు, బోధనలతో ప్రజలను చైతన్యం తెచ్చారు. బాంబే లెజిస్లేటివ్ అసెంబ్లీ, కౌన్సిల్‌లోనూ సభ్యుడిగా కొనసాగారు. న్యాయ, సామాజిక, ఆర్థిక శాస్త్రాలలో పరిశోధనలు చేశారు. 1956 డిసెంబరు 6న కన్నుమూశారు. మరణానంతరం 1990లో దేశ అత్యున్నతమైన 'భారతరత్న' ప్రకటించారు.

షంషాద్ బేగం (జయంతి)



హిందీ సినీరంగంలో తొలి నేప థ్యగాయని, 'పద్మభూషణ్' గ్రహీ త షంషాద్ బేగం 1919 ఏప్రిల్ 14న లాహోర్‌లో జన్మించారు. హిందీ, బెంగాలీ, మరాఠీ, గుజ రాతీ, తమిళ, పంజాబీ భాషలలో 6వేలకుపైగా పాటలు పాడారు. నౌషాద్ అలీ, ఎస్‌డీ బర్మన్, ఓపీ నయ్యర్‌వంటి సంగీతదర్శకుల నేతృత్వం లో పాటలు ఆలపించారు. ఓపీ నయ్యర్ అవార్డు గ్రహీత. 1940 నుంచి 1970ల మధ్య ఆమె పాడిన పాటలు నేటికీ ఆదరణ పొందుతున్నాయి. 2013 ఏప్రిల్ 23న కన్నుమూశారు.

గొల్లపూడి మారుతీరావు (జయంతి)



గొల్లపూడి మారుతీరావు 1939 ఏప్రిల్ 14న విజయనగరంలో జన్మించారు. రచయిత, నటుడు, సంపాదకుడు, వ్యాఖ్యాత, పాత్రి కేయుడు. సాహిత్యాభివృద్ధికి ఎన లేని కృషి చేశారు. తెలుగు సినీ రంగంలో మాటల రచయితగాను, నటుడిగాను సుపరిచితులు. తెలుగు సాహిత్యంపై ఆయన రాసిన పరిశోధనాత్మక రచనలు, నాటకాలు యూని వర్సిటీలలో పాఠ్యాంశాలుగా ఉన్నాయి. సినిమాలలోకి రాకముందు నాటకాలు, కథలు, నవలలు రాశారు. రేడియో ప్రయోక్తగా, అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్‌గా, ఆంధ్రప్రభ దినపత్రిక ఉపసంపాదకులుగా పనిచేశారు. ఉత్తమ కథా రచయితగా ఐదు నంది అవార్డులు అందుకున్నారు. 2019 డిసెంబరు 12న కన్నుమూశారు.

ప్రత్యేక పూజలు

అమరాపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హేమావతి గ్రామంలో నొళంబులు పాలిం చిన శైవక్షేత్రం హెంజేరు సిద్దేశ్వరస్వామికి ఆది వారం ప్రత్యేకపూజలు నిర్వ హించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్ తెలిపారు. ఉదయాన్నే వివిధ రకాల అభిషేకాలు, రుద్రాభిషేకం, కుంకుమాభిషేకం, తైలాభి షేకం నిర్వహించి సిద్దేశ్వర స్వామిని ప్రత్యేకంగా పూలతో అలంకరించి వెండి కవచాలు ధరించి వచ్చిన భక్తులకు మహా మంగళ హారతి, తీర్థ ప్రసాదాన్ని పంచిపెట్టారు.



నేరాల నియంత్రణపై అవగాహన



శిబిరంలో పాల్గొన్న విద్యార్థులతో పోలీసులు

చింతామణి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్ఆర్ లే అవుట్ నారెప్పకుంట సమీపానగల పతంజలి యోగా శిక్షణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటైన వసంత శిబిరంలో ఆదివారం పోలీసుశాఖచే నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. సీనియర్ పోలీసు అధికారులు పాల్గొని ప్రసం గించారు. డీఎస్పీ పి మురళీధర్, చింతామణి టౌన్ స్టేషన్ సీఐ విజికుమార్, కెంచార్ల హళ్ళి సీఐ వెంకటరామప్పలు మాట్లాడుతూ ఇటీవలిగా పిల్లలపై జరుగుతున్న దాడుల నియంత్రణకు సంబంధించి ప్రస్తావించారు. లైంగిక దాడులు, వేధింపుల వల్ల చోటు చేసుకుంటున్న పరిణామాలు, వాటి నియంత్రణ గురించి వివరించారు. చోరీలు, చైన్‌స్నాచింగ్ ఘటనలను ప్రస్తావిస్తూ అందరి సహకారంతోనే నేరాల నియంత్రణ సాధ్యమన్నారు. అలాగే లైసెన్స్, ఇన్సూరెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని సూచించారు. పతంజలి యోగ సమితి సీనియర్ నారాయణప్ప మాట్లాడుతూ పిల్లలకు వేసవి శిబిరంలో యోగాభ్యాసం, మాతృభోజన, కొండలు అధిరోహించడం వంటి కార్యక్రమాలు నేర్పిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో యోగా ట్రైనర్‌లు రాజశేఖర్ యాగంటి రమేశ్‌గౌడ, శివకుమార్, రామలక్ష్మమ్మ, ప్రసన్న పార్వతి, శంకరనారాయణ, తిమ్మసంద్ర అశ్వత్థ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో వికాసం



ట్రోఫీతో జట్టు, నిర్వాహకులు

దొమ్మసంద్ర, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సమాజంలో పిల్లల విద్యా భ్యాసంపై ఒత్తిడి పెరుగుతోందనీ, వారిలో వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు అవసరమని వెల్‌స్ప్రింగ్ అకాడమీ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రతి విద్యార్థి కూడా క్రీడల్లో భాగస్వామ్యం అయ్యేలా ప్రోత్సహించాలని సూచించారు. సర్జాపుర సమీపాన ముగళూరు గ్రామంలోగల వెల్‌స్ప్రింగ్ అకాడమీ ఆధ్వర్యంలో ఫుట్‌బాల్ టోర్నీని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు విద్యార్థిదశలో క్రీడల్లో ఎక్కువగా పాల్గొనడం ద్వారా వారిలో శారీరక, మానసిక సామర్థ్యం పెరుగుతుందన్నారు. రోజూ పిల్లలు పాఠాలతోపాటు ఆటల్లో పాల్గొనేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. ఇటీవలికాలంలో పిల్లల్లో స్థూలకాయం వంటివి పెరిగాయని తద్వారా అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. సర్జా పుర ప్రాంతం బెంగళూరు నగరానికి సమీపంలో ఉన్నా గ్రామీణ సొబగులు తగ్గలేదన్నారు. కాగా ఇక్కడ గ్రామీణ విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమా ణాలతో విద్యను అందించేలా పాఠశాలలు ఉండడంతో ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉందన్నారు. పిల్లలకు ఆస్తులు కంటే మంచి విద్యను అం దించాలన్నారు. టోర్నీలో కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి 70కుపైగా జట్లు పాల్గొన్నాయి. టోర్నీ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ అఖిలేశ్వర్‌రెడ్డి, దినేశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మోరీన్ చతుర్వేది, భరత్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టౌన్‌షిప్ పనులు త్వరగా పూర్తికావాలి



ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే నారాయణస్వామి తదితరులు

బంగారపేట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): తాలూకాలో మంచి వర్షాలు కురిసే లక్షణాలు కనిపిస్తున్నాయని ఈసారి మంచి వర్షాలు కురవాలని, ఈ ప్రాంతంలో చేపట్టిన టౌన్‌షిప్ నిర్మాణపనులు త్వరగా పూర్తికావాలని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి అభిప్రాయపడ్డారు. తాలూకాలోని చిన్న కోటె గ్రామపంచాయతీ పరిధి ప్రశాంతనగర్‌లోని కాళికామాత ఆలయం మూడోవార్షికోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. విశేషపూజల అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మొదలియార్ కుటుంబీకులు మూడేళ్లక్రితం ఆల యాన్ని నిర్మించారన్నారు. కొవిడ్‌కాలంలో ఆడంబరంగా నిర్వహించలేదని, ప్రస్తుతం వైభవంగా ఉత్సవం నిర్వహిస్తున్నారన్నారు. గ్రామపెద్ద ఆది నారాయణప్ప, నారాయణస్వామిలు ఆలయంకోసం విశేషంగా శ్రమించా రన్నారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సభ్యులు, ఆలయ ధర్మకర్త ఆదినారాయణప్ప, కేయూడీఏ అధ్యక్షుడు గోపాలరెడ్డి, ప్రముఖులు కృష్ణేగౌడ, అమరేశ్, వెంకటరామప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శోభాయాత్ర

హెబ్బాళ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు ఉత్తర లోక్‌సభ పరిధిలోని సంజయనగర్‌లో విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో శ్రీరామనవమిని పురస్కరిం చుకుని శోభాయాత్ర ఆదివారం ఉత్సాహంగా జరిగింది. కేంద్రమంత్రి శోభాకరంద్లాజె ముఖ్యులుగా పాల్గొనగా నాగసాధు బాబావిఠ్ఠల్‌గిరి మహరాజ్ సాన్నిధ్యం వహించారు. కళాబృందాలు, భక్తుల మధ్య శోభాయాత్ర సాగింది. బీజేపీ ప్రము ఖులు వైఏ నారాయణస్వామి, కట్టా జగదీశ్, సీ మునికృష్ణ, స్థానిక నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు. అంతకుముందు కేంద్రమంత్రి శోభాకరంద్లాజె వేర్వేరు ఆల యాలలో విశేషపూజల్లో పాల్గొనగా సాదర స్వాగతం లభించింది.



శోభాయాత్రలో కేంద్రమంత్రి శోభాకరంద్లాజె, నాగసాధు తదితరులు

ఘాటిని సందర్శించిన డీసీఎం



డీకే దంపతులకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న పండితుడు

దొడ్డబళ్ళాపుర, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): దొడ్డబళ్ళాపుర తాలూకాలోని పురాణ ప్రసిద్ధ ఘాటి సుబ్రమణ్య దేవస్థానాన్ని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ సందర్శించారు. బెంగళూరు గ్రామీణ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, పౌర సరఫరాలశాఖ మంత్రి మునియప్పతో కలసి ఆదివారం ఉదయం ఆలయాన్ని సందర్శించి విశేషపూజల్లో పాల్గొన్నారు. డీసీఎంకు స్వామివారి చిత్రపటాన్ని అర్చకులు అందజేశారు. అనంతరం డీసీఎం మీడియాతో మాట్లాడుతూ ఆలయ సన్నిధిలో రాజకీయాలు మాట్లాడేది లేద న్నారు. మంత్రుల రాక సందర్భంగా కొద్దిసేపు దర్శనాన్ని ఆపేయ డంతో భక్తులు క్యూలో పెద్దసంఖ్యలో వేచియుండాల్సి వచ్చింది.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో మాజీ మంత్రి లింబావళి తదితరులు

మహదేవపుర, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగనిర్మాత డాక్టర్ భీమరావ్ అంబేడ్కర్‌కు నిజమైన గౌరవాన్ని అందించిన ఘనత ప్రధాన మంత్రి నరేంద్రమోదీకే దక్కుతుందని మాజీ మంత్రి అరవింద లింబావళి అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలోని అంబేడ్కర్‌గుట్టపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి, సముదాయభవనాన్ని ఆదివారం లాంచ నంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశం గర్వించ దగిన నాయకులపట్ల కాంగ్రెస్ పార్టీ ఏవిధంగా వ్యవహరించిందనేది ప్రపంచం మొత్తం తెలుసునన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక అంబేడ్కర్ లభించాల్సిన నిజమైన గౌరవం సాధ్యమైందని అందుకు ప్రధాన కారణం ప్రధాని నరేంద్రమోదీయేనన్నారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చేలా రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. అంబే డ్కర్ ఆశయాలు ఎంతో గొప్పవన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మంజుళా లింబావళి, నియోజకవర్గ బీజేపీ అధ్యక్షుడు హూడి పిళ్ళప్ప, శ్రీధర్‌రెడ్డి, ప్రముఖులు గుట్ట మారప్ప, మహేంద్రమోది, మనోహరరెడ్డి, ఆదూరు మునిరాజు తదిరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు మంచి రోజులు

- మడకశిరలో ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తి
- ఈ నెలలో మంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం

మడకశిర టౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): గత ఏడాది రాష్ట్రంలో పాలన మారడంతో గత టీడీపీ ప్రభుత్వంలో ఆగిపోయిన పనులు పూర్తవుతు న్నాయి. అలాంటి కోవకు చెందినదే మడకశిర ఇండోర్ స్టేడియం(క్రీడా వికాస కేంద్రం). వెనుకబడిన మడకశిర ప్రాంతంలో క్రీడాభివృద్ధి కోసం గత టీడీపీ ప్రభుత్వంలో రెండు కోట్ల రూపాయలతో స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం చేపట్టారు. దాదాపు 80శాతం పనులు పూర్తి చేశారు. అయితే 2019లో రాష్ట్రంలో వైసీపీ అధి కారంలోకి రావడంతో మిగిలిన పనులకు గ్రహణం పట్టింది.

అన్ని వసతులతో స్టేడియం

వైసీపీ అధికారం కోల్పోయి టీడీపీ నేతృత్వంలో నూతన ప్రభుత్వం ఏర్ప డటంతో ఇండోర్ స్టేడియానికి మంచి రోజులు వచ్చినట్లైంది. ఇటీవలే అన్ని హంగులతో ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తి చేశారు. ప్రస్తుతం ఇండోర్ స్టేడియం నిర్మించడంతో పాటు అవసరమైన క్రీడా సామగ్రిని సమకూర్చుతుండటంతో క్రీడాకారులకు ప్రతిభను చాటు కునేందుకు మంచి అవకాశం ఏర్పడింది. చెస్, క్యారమ్, షటిల్ బ్యాడ్మిం టన్, టెన్నికాయిట్ తదితర క్రీడల్లో సత్తా చాటే అవకాశం కలుగుతోం ది.దీనిపై పలువురు క్రీడాకారులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తు న్నారు. రాష్ట్ర మంత్రి రామ్ ప్రసాద్‌రెడ్డి ఈ నెలలో ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవానికి మడకశిరకు వస్తున్నారు. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మడకశిరలో మాదిరే నియోజక వర్గంలో మిగిలిన మండలాల్లో కూడా ఇండోర్ స్టేడియంలు నిర్మించా లని స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పే స్వామి మంత్రిని కోరనున్నట్లు సమాచారం.

హనుమాన్ విగ్రహ స్థాపనకు భూమిపూజ

రాయచూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రాయచూరు తాలూకాలో ప్రముఖ దేవస్థానంగా ఖ్యాతిగాంచిన పంచముఖి గాణదాళ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద భారీ హనుమాన్ విగ్రహం ఏర్పాటుకు ఆదివారం రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ భూమిపూజ చేశారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గాణదాళతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు పెద్దసంఖ్యలో హాజరైయ్యారు. ఆలయ సమీపంలో పంచముఖి ఆంజనేయ ఆలయం సమీపంలో 108 అడుగుల ఎత్తైన భారీ హనుమాన్ విగ్రహం ఏర్పాటుకు భక్తులు సిద్ధమైయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ, ప్రజల్లో భక్తిభావాలు పెరగడం శుభదాయకమన్నారు. ఆధ్యాత్మిక భావనవల్ల ప్రజల్లో శాంతి సామరస్యాలు వెల్లివిరిస్తాయన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే దద్దల బసనగౌడ

వైభవంగా ఆదిఆంధ్రుని దీపోత్సవం



ఆదిఆంధ్రుని దీపాన్ని వెలిగిస్తున్న భక్తులు

సోమందేపల్లి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుడి పల్లి గ్రామంలో సజ్జగంట రంగనాథస్వామి బ్రహ్మో త్సవాల్లో భాగంగా ఆది వారం ఆదిఆంధ్రుని దీ పోత్సవం వైభవంగా జరి గింది. అనాధిగా వస్తున్న ఆచారంలో భాగంగా ఊరి బయట ఉన్న ఆది ఆంధ్రుని ఆలయం నుం చి ఊరేగింపుగా తీసుకొ చ్చిన దీపాన్ని రంగనాథ స్వామి ఆలయం ముం దున్న దీపపు స్థంభంపై ఉంచారు. అనంతరం ఆ లయ ధర్మకర్త రమాకాం త్‌రెడ్డి మాట్లాడుతూ పూ ర్వం ఆదిఆంధ్రుని ఆల యంలో భక్తులు మూడు రోజులపాటు తపస్సుచేసి దీపాన్ని ఆర్పకుండా కాపాడటంతోపాటు మూడోరోజు ఆ దీపాన్ని తెచ్చి ఆలయం దీపం స్థంభంపై వెలిగించారన్నారు. ఆనాటి నుంచి ఆచారాన్ని కొనసాగిస్తూవస్తున్నారన్నారు. ఇలా దీపం వెలిగిస్తే సమృద్ధిగా పంటలు పండి ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారని ప్రజల విశ్వాసమన్నారు. ఆదివారం జరిగిన కార్యక్రమాన్ని తిలకిం చేందుకు మండలంలోని వివిధ గ్రామాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. కోలాటం ఆడుతూ దీపాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చారు. భక్తులు ప్రదక్షిణలు చేస్తూ పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో యువకులు దీపపు స్తంభంపైకి ఎక్కి ఆదిఆంధ్రుని దీపాన్ని వెలిగించారు. భక్తులు రంగ నాథస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బెంగళూరుకు చెందిన భక్తుడు బాలాజీ భక్తులకు అన్నదానం నిర్వహించారు.

నాగమ్మదేవి ఆలయ వార్షికోత్సవం



అమ్మవారికి విశేష అలంకరణ

ముళబాగిలు, ఏప్రిల్13 (ఆంధ్రజ్యోతి): ముళబాగిలు పట్టణం లోని పురాణ ప్రసిద్ధమైన నాగమ్మదేవి ఆలయ 18వ వార్షికోత్సవం, నాగదేవత హోమం పురస్కరించుకుని విశేష పూజలు జరిగాయి. ఉదయం గణపతి పూజ, స్వస్తివాచన, దేవనాంది కళశ స్థాపన, నాగదేవత హోమం, అభిషేకం, స్థానిక భక్తులచే భజనలు జరిగాయి. భక్తులకు ప్రసాద వినియోగం, అన్న సంతర్పణ నిర్వహించారు. అయాన్ని విద్యుద్దీపాలతో అందంగా అలం కరించారు. అర్చకులు మధుసూధన్ శర్మ, శశాంక్‌శర్మ నేతృత్వంలో పూజాకైంకర్యాలు సాగాయి. జ్యోతినగర్ వాసులు, కొత్తపాళ్య నరసింహయ్య కుటుంబీకులు ప్రాయోజకత్వం వహించారు. ఉత్సవంలో గ్రామపెద్దలు మునినారాయణప్ప, నాగరాజ్, శంకరప్ప, దినకర్, మహేశ్, మురళిగాణిగ పాల్గొన్నారు.

శిడ్లఘట్టలో కరగ ఉత్సవం



కరగమ్మదేవి ఊరేగింపు

శిడ్లఘట్ట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్ట పట్టణంలో కరగ మహోత్సవం వైభ వంగా జరిగింది. శనివారం రాత్రి ప్రారం భమైన ఉత్సవం ఆదివారం సాయంత్రం వరకు కరగ ఊరేగింపు సాగింది. దాదాపు నెలరోజులనుంచి కరగ ఉత్సవానికి కసరత్తు సాగింది. ఎంతో భక్తిశ్రద్ధలతో నిష్ఠతో కరగధారి నియమాలు పాటించారు. కరగమ్మదేవికి విశేష పూజల అనంతరం కరగను ధరించి పట్టణంలోని ప్రముఖ వీధులలో ఊరేగింపు సాగింది. ప్రధాన కూడళ్లలో ఆర్కెస్ట్రా, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఎమ్మెల్యేతో సంఘం డైరెక్టర్లు

హొస్కోటె, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అన్నివర్గాల ప్రజల ఆర్థిక స్వావలంబనకు దోహదపడే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తోందని హొస్కోటె పట్టణ వివిధోద్దేశ ప్రాథమిక గ్రామీణ కృషి సహకారసంఘానికి నూతంగా నామినేట్ అయిన డైరెక్టర్ కొళతూరు కేబీ జై ప్రకాశ్ నారా యణ్ పేర్కొన్నారు. సంఘం నామినేటెడ్ డైరెక్టర్‌గా ఎంపికైన నేపథ్యంలో ఎమ్మెల్యే బచ్చేగౌడను మర్యాదపూర్వకంగా భేటీ అయి అభినందన స్వీక రించి మాట్లాడారు. ఎమ్మెల్యే శరత్‌బచ్చేగౌడ వంటి నాయకులు తనపై విశ్వాసంతో సహకార బ్యాంకుకు నామినేటెడ్ డైరెక్టర్ అయ్యానన్నారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రసన్న చౌడేశ్వరీదేవి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ముళబాగిలు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కొల దేవి గ్రామంలో కొలువైన ప్రసన్న చౌడేశ్వరిదేవి ఆలయ 39వ బ్రహ్మరథోత్సవం వైభవంగా జరి గింది. తొలుత ఉత్సవ మూర్తు లకు విశేషపూజల అనంతరం రథంపై కొలువుదీర్చి మహా మం గళ హారతి అనంతరం వేద పండి తుల వేద ఘోషలమధ్య రథోత్స వాన్ని ప్రారంభించారు. ఎండను సైతం లెక్కించక భక్తులు పెద్దసంఖ్యలో రథోత్సవంలో పాల్గొన్నారు. రథం పై దవనం, అరటిపండు వేసి మొక్కులు తీర్చుకు న్నారు. ఆలయ మూలవిరాట్టుకు పంచామతాభిషేకం, రుద్రాభిషేకం, విశేష పుష్పాలంకరణ నిర్వహించారు. ప్రధాన ఆగమికులు గురుప్రసాద్ ఆచార్, అర్చ కులు నాగభూషణ్‌దీక్షిత్, మోహనాచార్, భవాని ప్రసాద్‌ల ఆధ్వర్యంలో పూజా కైంకర్యాలు జరిగాయి. కొలదేవి గ్రామస్థులచే భజన కార్యక్రమం జరిగింది. రథోత్సవంలో పాల్గొన్న భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు.

జీవాకు వేధింపులు వాస్తవమే

బెంగళూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): బోవి అభివృద్ధి కార్పొరేషన్ అవినీతికి సంబంధించి విచారణ వేళ మహిళా న్యాయవాది, కాంట్రాక్టర్ జీవా ఆత్మహత్యకు డీఎస్పీ వేధింపులు కారణమని సిట్ నిర్ధారించింది. ఈమేరకు హైకోర్టుకు 2,300 పేజీలతో చార్జ్‌షీట్ ద్వారా తుది నివేదికను సమర్పించారు. ఐపీఎస్ అధికారులు వినాయక్ వర్మ, అక్షయ్ మచీంద్ర, నిషాజేమ్స్‌ల నేతృత్వంలో సిట్ సమగ్రంగా దర్యాప్తు చేసింది. సాక్ష్యుల అభిప్రాయాలను వీడియోల ఆధారంగా నివేదిక ఇచ్చింది. డీఎస్పీ కనకలక్ష్మి వేధింపులతోనే జీవా ఆత్మహత్యకు కార ణమైనట్టు చార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. హైకోర్టు సూచనకు అనుగుణంగా సమగ్ర దర్యాప్తుతో చార్జ్‌షీట్ దాఖలుపై హైకోర్టు సంతృప్తి వ్యక్తం చేసింది. జీవా ను విచారణ పేరిట వివస్త్రను చేసి వేధించినట్టు రుజువైంది. కొన్ని వీడియోలను ఎఫ్ఎస్ ఎల్ ద్వారా తిరిగి సేకరించి నట్టు చార్జ్‌షీట్‌లో నమోదు చేశారు.